దేవాలయాలకు నవ్య శోభ

- ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రణాళికలు
- జిల్లాలో 13 గుడుల పునర్నిర్మాణానికి అనుమతులు
- రూ.11.43 కోట్ల విడుదలకు పరిపాలనా అనుమతులు

కర్నూలు కల్చరల్: జిల్లాలోని పలు ఆలయాలు నవ్య శోభను సంతరించుకోనున్నాయి. ఆయా దేవాలయాల జీర్ణోద్ధరణకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చింది. జిల్లాలోని 13 దేవాలయాలకు సంబంధించి ఆధునికీకరణ, పునఃనిర్మాణ పనులు చేపట్టేందుకు దాదాపు రూ.11.43 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) కింద రూ.9,53,50,000, మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ కింద 1,90,70,000 నిధులు ఉన్నాయి. ఈనిధులతో ఆలయాల రూపు మారి అధునాతనంగా దర్శనమివ్వనున్నాయి.



పెరవలి రంగనాథ స్వామి ఆలయం



గద్దెరాళ్ల మారెమ్మ దేవాలయం

త్వరలోనే పునరుద్ధరణ పనులు ప్రారంభం



జిల్లాలోని 13 ఆలయాల్లో పునఃనిర్మాణ, ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు వచ్చాయి. త్వరలోనే టెండర్లు పిలిచి నిర్మాణ పనులు చేపడతాం. కామన్ గుడ్ ఫండ్‌తో పాటు ఆలయాల మ్యాజింగ్ గ్రాంట్ నిధులను కలుపుకొని నిర్మాణ పనులకు నిధులు వెచ్చిస్తాం. ఈ నిధులతో ఆలయాల రూపు రేఖలు మారతాయి. – **ఆదిశేషు నాయుడు, సహాయ కమిషనర్, దేవదాయ శాఖ**

పునరుద్ధరణకు కేటాయించిన నిధులు ఇలా..

- ఓర్వకల్ మండలం కన్నమడకల గ్రామం శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.40 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8 లక్షలు.
- ఓర్వకల్ మండలం నన్నూరు గ్రామంలోని శ్రీ లక్ష్మి సమేత మాధవ స్వామి ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.10 లక్షలు.
- కర్నూలు నగరం కన్నప్ప చౌల్ట్రీలోని శ్రీ సత్య నారాయణ స్వామి కల్యాణ మండపం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.75 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.15 లక్షలు.
- కర్నూలు కుమ్మరి వీధిలోని శ్రీ రాంబొట్ల దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.20 లక్షలు.
- కర్నూలునగరంలోని శ్రీకోట ఆంజనేయ స్వామి ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.20 లక్షలు.
- దేవనకొండ మండలం కప్పట్రాళ్లలోని శ్రీ కొలుట్ల చెన్నకేశవ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1.20 కోట్లు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.24 లక్షలు.
- గద్దెరాళ్ల గ్రామం శ్రీ గద్దెరాళ్ల మారెమ్మ ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1.15 కోట్లు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.23 లక్షలు.
- ఆస్పరి మండలం శంకరబండ గ్రామంలోని శ్రీ మాధవస్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.43 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8.60 లక్షలు.
- మద్దికెర మండల పెరవళి గ్రామంలోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.20 లక్షలు.
- కోసిగి మండలం నేలకోసిగి గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.27.50 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.5.50 లక్షలు.
- కోసిగి మండలం జమ్ములదిన్నె గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.50 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.10 లక్షలు.
- నందవరం మండలం కనకవీడు గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.43 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8.60 లక్షలు.
- ఎమ్మిగనూరు మండలం గార్లదిన్నె గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.40 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8 లక్షలు మంజూరయ్యాయి.

క్లుప్తంగా

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కోడుమూరులో..

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు రూరల్ రెవెన్యూ కార్యాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే వినతులు అందజేయవచ్చునని ఆయా మండలాల రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు.

తైక్వాండో క్రీడాకారులకు సహకారం అందిస్తాం

- టీజీ వెంకటేష్

కర్నూలు (టౌన్): తైక్వాండో క్రీడాకారులకు తన వంతు సహకారం అందిస్తానని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఇటీవల పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించే కార్యక్రమం నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే మార్షల్‌ఆర్ట్స్‌ను ఎంచుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. కఠోర సాధన వల్ల ఈ క్రీడల్లో రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజినేయలు, రామక్రిష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు సక్రమంగా నీరు సరఫరా చేయాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని బుధవారపేట నుంచి పాతబస్తీకి పోయే దారిలో ఉన్న శివాలయం వీధి చుట్టుపక్కల మహిళల కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్లకు సక్రమంగా నీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మకు స్థానిక మహిళలు విన్నవించుకున్నారు. ఆదివారం ఆమె మరుగుదొడ్ల స్థలాన్ని పరిశీలించారు. అయితే మరుగుదొడ్లు ఉన్నా మోటార్‌కు ప్రత్యేక గ్రిల్ లేకపోవడంతో మునిసిపాలిటీ వారు తాళాలు వేసుకొని పోతుండడంతో కుళాయిలు వచ్చిన సమయంలో నీరు నింపడం కష్టంగా ఉందన్నారు. అంతేగాక రాత్రిపూట లోపల లైట్లు వెలగడం లేదన్నారు. స్పందించిన ఆమె విషయాన్ని మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, మహేశ్వరి పాల్గొన్నారు.

త్రిపురలో దాడులు హేయం

కర్నూలు(సెంట్రల్): త్రిపురలో వామపక్ష ఉద్యకారులపై ఆర్ఎస్ఎస్–బీజేపీ గుండాలు దాడి చేయడం హేయమైన చర్య అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు. త్రిపురలో ఇటీవల రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ వామపక్ష ఉద్యమకారుల ఇళ్లు, కార్యాలయాలను ధ్వంసం చేయడం ఘోరమన్నారు. ఇలాంటి సంఘటనలను ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.

4న అరుణాచలంకు ప్రత్యేక బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): గిరి ప్రదక్షిణ దీపోత్సవం సందర్భంగా తమిళనాడులోని అరుణాచల క్షేత్రం దర్శనం సందర్భంగా ఏప్రిల్ 4వ తేదీన సూపర్ లగ్జరీ (హైటెక్) ప్రత్యేక బస్సు (సర్వీస్ నంబర్–93999)ను నడపనున్నట్లు కర్నూలు–2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మంగళవారం సాయంత్రం 6గంటలకు కర్నూలు నుంచి ఈ బస్సు బయలుదేరి, బుధవారం తెల్లవారు జామున 4:30గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర స్వామి దర్శనం, దీపోత్సవం అనంతరం అదే రోజు సాయంత్రం 4గంటలకు బస్సు బయలుదేరి, గురువారం ఉదయం 6 గంటలకు కర్నూలుకు చేరుకుంటుందని వెల్లడించారు. అరుణాచలం క్షేత్ర దర్శనం రాక, పోకల కోసం ప్రత్యేక బస్సు చార్జీ రూ.2 వేలు ఉంటుందని, ఇందులో ముందస్తు టిక్కెట్లు తీసుకునేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. బస్టాండ్లు, ఏజెంట్లు, ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందవచ్చని, వివరాలకు అసిస్టెంట్ మేనేజరు సెల్ 7382871131, 9959225794 (తన) నంబర్లకు ఫోన్ చేయాలని, లేదా సమీపంలోని డిపో మేనేజర్లను సంప్రదించాలని కోరారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : కబ్జా, బలగం, ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : కబ్జా, సార్, ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్, గనా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : తూ జూటీ మై మక్కర్, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్
భరత్ కాంప్లెక్స్ : పులి ది నైన్‌టీన్త్ సెంచరీ, వినరో భాగ్యము విష్ణు కథ
రాజ్ : కబ్జా
శ్రీరామ : షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్
విజయ: పులి ది నైన్‌టీన్త్ సెంచరీ

ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలి

కర్నూలు(సెంట్రల్): బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఆపహాస్యం అవుతోందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని అవాజ్ వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు లౌకికవాదులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్‌హాలులో మతోన్మాదం–ప్రజాస్వామ్యం అనే అంశంపై అవాజ్ కమిటీ నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యవాదులు మేల్కొనకపోతే 2024లో మళ్లీ బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రణాళికలు వేసుకుందన్నారు. భారతదేశంలో లౌకిక వాదాన్ని పరిరక్షించుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, లేదంటే మతోన్మాదులు రెచ్చిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో అవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఏ సుబాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

జిల్లా రచయిత్రికి ఉగాది పురస్కారం

కర్నూలు కల్చరల్: ఆదోనికి చెందిన కవయిత్రి మశోకార్ నాగజ్యోతి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య బెంగళూరు వారు నిర్వహించిన కవితల పోటీల్లో ఉత్తమ కవితలు రాసిన రచయిత్రులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. జిల్లా రచయిత్రి నాగజ్యోతి రచించిన వెన్నెల్లో నక్షత్రాలు కవితా సంపుటికి ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం బెంగళూరులో మాజీ సీబీఐ జేడీ వి.వి.లక్ష్మినారాయణ, కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ప్రతినిధుల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ నేపథ్యంలో నాగజ్యోతికి సాహితీ సంస్థలు, సాహితీ వేత్తలు అభినందనలు తెలిపారు.



ఉగాది పురస్కారం అందుకున్న నాగజ్యోతితో అతిథులు

భారతీయ వైదిక కాలమానాన్ని చాటి చెప్పాలి



ఉగాది వేడుకల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: భారతీయ వైదిక కాలమానాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలనే ఉద్దేశంతో పాటు అంతటా భారతీయత అనే తలంపుతో విజ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సరిపిరాళ్ల రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సమితి కార్యాలయంలో వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం సాయంత్రం 5.30 గంటలకు శోభకృత్ నామ సంవత్సర వేడుకలతో పాటు శ్రీశోభకృత్ నామ తెలుగు సంవత్సర కాలమాన పట్టిక ఆవిష్కరణ జరుగుతుందన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్. సాయిగోపాల్, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, విజ్ఞాన సేవా సమితి కార్యవర్గ సభ్యులు వంగల రాజేంద్ర రణధీర్‌రెడ్డి అతిథులుగా, భాగ్యనగరం ఆధ్యాత్మిక వేత్త, రచయిత భాస్కర యోగి ప్రధాన వక్తగా హాజరు కానున్నారన్నారు. వీఎస్ఎస్ సభ్యులు, తెలుగు భాషాభిమానులు అందరూ పాల్గనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జి.పుల్లారెడ్డి కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ బి.వీరభద్రారెడ్డి, వీఎస్ఎస్ కార్యదర్శి వెలుగుల సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

చిన్మయ మిషన్‌లో బాలవికాస్ తరగతులు

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరిలో సామాజిక పరివర్తన అవసరమని స్వామిని సుప్రేమానంద సరస్వతి అన్నారు. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం వీఆర్ కాలనీలోని మిషన్ కేంద్రంలో బాలవికాస్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం చిన్నారులకు బాలవికాస్ తరగతులు, పెద్దలకు భగవద్గీత తరగతులు ఉంటాయన్నారు. విద్యార్థులకు మంచి వ్యక్తిత్వ నిర్మాణం జరిగినప్పుడే దేశం నవ్యపథంలో దూసుకెళ్తుందన్నారు. మిషన్ సభ్యులు పాల్గొన్నారు.



బాలవికాస్ తరగతుల్లో చిన్నారులు

వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలి

కర్నూలు(రాజ్‌విహార్): జిల్లాలోని అన్యాక్రాంతం అయిన, అవుతున్న వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అంజుమన్ ఎ ఇస్లామియా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ అండ్ వక్ఫ్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్ కమిటీ కన్వీనర్ అయూబ్ అలీఖాన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీ.క్యాంప్ సమీపంలోని మైనారిటీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలుతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ సంస్థల ఆస్తులు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నగరంలోని డాక్టర్ అబ్దుల్ యునాని ఆసుపత్రి, మెడికల్ కళాశాల, ది ఇస్లామియా అరబిక్ డిగ్రీ కళాశాల, ఉమర్ అరబిక్ హైస్కూల్, ఉమర్ అరబిక్ ప్రైమరీ స్కూల్, ఉర్దూ పాఠశాలలకు సంబంధించిన స్థలాలకు రక్షణ లేకుండా పోతోందని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కొందరు కమిటీ సభ్యులు వక్ఫ్ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. నూతన కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు ఆస్తుల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు జంషీద్ అలీ ఖాన్, మన్సూర్ అహ్మద్, జహంగీర్, సొహెబ్ అలీ బేగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిటీ కన్వీనర్ అయూబ్ అలీఖాన్

26న 'మాలపల్లి' నవలపై సాహితీ సదస్సు

కర్నూలు కల్చరల్: ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వంద సంవత్సరాల 'మాలపల్లి ' ఉన్నవ లక్ష్మీనారాయణ నవలపై సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్లు సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర తెలిపారు. ఎస్వీ కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఈ ఉపన్యాస మాలికను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.బి.ఆర్.సాయిగోపాల్ ముఖ్య అతిథిగా, ప్రసిద్ధ సాహితీ వేత్త కొలకలూరి ఇనాక్ ప్రధాన వక్తగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సాహితీ ప్రియులు అందరూ పాల్గొన వచ్చని విజ్ఞప్తి చేశారు.

'వడ్డీ మాఫీ'కి మంచి స్పందన

– ఒక్కరోజే రూ.26 లక్షలు పన్ను వసూళ్లు

కర్నూలు (టౌన్): రెండు రోజుల క్రితం ప్రభుత్వం పన్నుదారులకు ఊరట కల్పిస్తు పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ ప్రకటించింది. దీనిపై నగర వాసుల నుంచి మంచి స్పందన వస్తోంది. పన్నుదారుల కోసం సెలవు దినం ఆదివారం నగరపాలక కార్యాలయంలో పన్ను కౌంటర్లు తెరిచారు. దీంతో పలువురు పన్నులు కట్టేందుకు తరలివచ్చారు. నగదు రూపంలో రూ.12 లక్షలు, చెక్కుల రూపంలో రూ.12 లక్షలు, నీటి పన్ను రూ.4 లక్షలు మొత్తం రూ.26 లక్షలు పన్ను వసూళ్లు అయ్యినట్లు నగరపాలక మేనేజర్ చిన్నరాముడు వెల్లడించారు.

కొనసాగుతున్న పీడీపీ ఉద్యోగుల నిరసన

కర్నూలు(రాజ్‌విహార్): సమస్యలు పరిష్కరించాలని ప్రజా రవాణ శాఖ ఉద్యోగులు చేస్తున్న నిరసన కొనసాగుతోంది. ఆదివారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కర్నూలు–1, 2 డిపోల ముందు ఆ సంఘం నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మద్దిలేటి, ఏవీ రెడ్డి, ఆర్‌వీఎం రావు, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డోర్ డెలివరీతో సమయం ఆదా

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణ సంస్థ ప్రవేశపెట్టిన కార్గో – కొరియర్ పార్సిల్స్ డోర్ డెలివరీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు–2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యంగా వాణిజ్య సంస్థలు, మందుల దుకాణాలు, వ్యాపారస్తులు సమయాన్ని వృథా చేసుకోకుండా తమ పార్సిల్స్‌ను డోర్ డెలివరీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కర్నూలు నగర శివారులోని 10కిలో మీటర్లలోపు దూరంలో ఉన్న అడ్రస్‌లకు సేవలు అందుబాటులో ఉన్నాయని, 10 కేజీల్లోపు బరువు ఉన్న పార్సిల్స్ బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు.

ఆదర్శ విద్యా సంస్థల అధినేత సతీమణి మృతి

కర్నూలు సిటీ: ఆదర్శ విద్యా సంస్థల అధినేత బి.తిమ్మయ్య యాదవ్ సతీమణి బి.శారదమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లెక్చరర్‌గా పని చేస్తూ రిటైర్ అయ్యారు. ఆ తరువాత శంకరాస్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కూడా పని చేశారు. వీరికి ఇద్దరు సంతానం. కొడుకు డా.హరికిషన్ ప్రస్తుతం శంకరాస్ డిగ్రీ కాలేజీ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. కూతురు బి.రమాదేవి ఉన్నారు. ఈమె మృతి పట్ల పలువురు సంతాపం తెలియజేశారు. అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు జరుగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గస్తీ పోలీసులకు గంజాయితో దొరికిన విద్యార్థులు!

కర్నూలు: కర్నూలు నుంచి అనంతపురం జిల్లా గోరంట్ల సమీపంలో ఉన్న అగ్రికల్చర్ యూనివర్సిటీకి వెళ్తున్న విద్యార్థులు గస్తీ పోలీసులకు గంజాయితో పట్టుబడటంతో దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు, కర్నూలు, నంద్యాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ చదువుతున్నారు. ఇందులో ఒకరు నంద్యాల సెబ్ స్టేషన్ (ఎక్సై జ్)లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కుమారుడు. కానిస్టేబుల్ కుమారుడికి గంజాయి తాగే అలవాటు ఉండడంతో కొంత కాలంగా అనంతపురం జిల్లా ధర్మవరం నుంచి గంజాయి ప్యాకెట్లు కొనుగోలు చేసి తాగేవాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన విద్యార్థి పొలంలో గంజాయి మొక్కలు సాగు చేసి, మొక్కలను వాట్సాప్ ఫొటోలు చూపించడంతో కొనుగోలు చేసేందుకు అతను అంగీకరించాడు. మూడు రోజుల క్రితం నంద్యాల విద్యార్థికి చెందిన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం పెద్దమర్రివీడుకు వెళ్లి పొలంలో ఉన్న ఆరు కిలోల పచ్చి గంజాయిని బ్యాగులో వేసుకొని కర్నూలుకు వచ్చాడు. నంద్యాల చెక్ పోస్టు వద్ద కర్నూలు, నంద్యాలకు చెందిన ఇద్దరు విద్యార్థులను కలుసుకొని ముగ్గురు ద్విచక్ర వాహనంపై మూడు రోజుల క్రితం అర్ధరాత్రి అనంతపురం వెళ్తుండగా బ్లూ కోల్ట్స్ సిబ్బందికి అనుమానం వచ్చి వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేశారు. దీంతో పెద్దమర్రివీడుకు చెందిన విద్యార్థి బ్యాగులో గంజాయి బయటపడింది. దీంతో ముగ్గురినీ అదుపులోని తీసుకొని విచారించగా పొంతన లేని సమాధాలు చెప్పడంతో వారి సెల్ ఫోన్లను పరిశీలించగా వాట్సాప్ చాటింగ్‌తో పాటు ఫొటోలు బయటపడ్డాయి. అలాగే ఎంత కాలం నుంచి వీళ్లమధ్యన ఈ వ్యవహారం సాగుతుందని కాల్ డేటా తీసి విచారిస్తున్నారు. అయితే కర్నూలుకు చెందిన విద్యార్థికి ఈ వ్యవహారంలో ఎలాంటి సంబంధం లేదని విచారణలో తేలినట్లు సమాచారం. గంజాయితో పట్టుబడిన విద్యార్థులపై కేసు నమోదు చేసి జైలుకు పంపితే వారి భవిష్యత్తు నాశనం అవుతందని వారి తల్లిదండ్రులు పోలీసులను ప్రాధేయపడుతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారి అనుమతితో ఒకటి రెండు రోజుల్లో వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుచనున్నట్లు సమాచారం.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు సిటీ: యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా జె.ఎల్లప్ప, ఎస్.ఎం జయరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా జిల్లా సహాధ్యక్షులుగా రవికుమార్, జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎస్.మారెప్ప, కోశాధికారిగా జి.హేమంత్‌కుమార్, కార్యదర్శులుగా నవీన్‌పాటి, ఎస్.ఇబ్రహీం, ఎం.లక్ష్మీదేవి, ఎస్.దావీదు, గాదిలింగప్ప, ఎ.దేవపాల్, నాగలక్ష్మీ, నరసింహులు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎస్.సి మద్దిలేటి, రాష్ట్ర కౌన్సిలర్లుగా పి.ఖాసిం, ఎం.నాగరాజు, కె.యేహోషువా, జి.శ్రీదేవిలు ఎంపికయ్యారు. నూతన కార్యవర్గ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ..ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేసేందుకు ఓ ప్రణాళిక తయారు చేసుకుంటామన్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్ పాల్గొనగా, ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా వ్యవహరించారు.



ఫెడరేషన్ నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.ఎల్లప్ప, జయరాజు

అలరించిన ఉగాది కవి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: తెలుగు కళ్లం సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో నిర్వహించిన శోభకృత్ ఉగాది నామ కవి సమ్మేళనం అలరించింది. సమితి వ్యవస్థాపకులు కవి రాజ డాక్టర్ చిన్నావుల వెంకట రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో సాహితీ వేత్తలు ఆదవాని హనుమంతప్ప, డాక్టర్ వి.పోతన, స్వరూప్ సిన్హా, ఎలమర్తి రమణయ్య ప్రసంగించారు. శోభకృత్ నామ సంవత్సరంలో అన్ని శుభాలు కలగాలని ఆకాంక్షించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నారు. కవులు స్వర్ణలత, షేక్షావలి, నిర్మలకుమారి, కృష్ణమూర్తి, సత్యప్రసాద్, శ్రీధర్ మూర్తి, అజీజ్, సుశీలారాణి, దస్తగిరి, రఘు, తదితరులు కవితలు చదివి వినిపించారు. రచయిత్రి చంద్రమౌళిని సమన్వయకర్తగా వ్యవహరించారు. అనంతరం సాహితీ వేత్తలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సాహితీ ప్రియులు పాల్గొన్నారు.



చిన్నావుల వెంకటరాజా రెడ్డిని సన్మానిస్తున్న సాహితీ వేత్తలు

కరాటే పోటీల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్): వచ్చే మే నెలలో నిర్వహించనున్న జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రామాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, కలర్‌బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి సమాజంలో ప్రతి విద్యార్థి, విద్యార్థినీ చదువుతో పాటు ఆసక్తి ఉన్న ఏదో ఒక క్రీడలో రాణించాలన్నారు. అదనపు అర్హతగా క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోలా ప్రతాప్, సుంకన్న పాల్గొన్నారు.



క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు

మల్లు స్వరాజ్యంకు నివాళి

కర్నూలు(సెంట్రల్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యమని, ఆమె స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై పోరాటలు చేస్తామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి అన్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఆమె వర్ధంతి కార్యక్రమాన్ని ఏపీ రైతు సంఘం నాయకులు నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..భూస్వామ్య కుటుంబంలో పుట్టిన మల్లు స్వరాజ్యం పేదల కోసం భూములను దానం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.వెంకటేశ్, మల్లయ్య, కృష్ణ, సూరి, సంజన, మధు, అయ్యప్ప, వీరన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

22 నుంచి నవరాత్రి పూజలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి 30వ తేదీ ఉగాది పర్వదినం మొదలు కొని శ్రీరామ నవమి వరకు శ్రీ మహాగౌరీ అమ్మవారికి వసంత నవరాత్రి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. అభిషేకాలు, సహస్రనామార్చన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అమావాస్యను పురస్కరించుకొని ఈనెల 21వ తేదీ ఉదయం 9 గంటలకు నవగ్రహ, లక్ష్మీ, గణపతి, మూల మంత్ర చండీహోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి సింధూరార్చన, దోష నివారణ పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నేడు శివపార్వతుల కల్యాణం

కర్నూలు కల్చరల్: సాత్యసాయి మందిరం ఆవరణలోని శ్రీసాయీశ్వరాలయంలో సోమవారం ఉదయం 7.30 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మాకా అశోక్‌కుమార్ తెలిపారు. శివాలయం ప్రతిష్ఠ మండలం పూజలు, సహస్ర ఘటాభిషేకం, పంచామృత అభిషేకం, పుష్పార్చన, శివపార్వతుల కల్యాణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ట్రస్ట్ సభ్యులు, భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం 1,060 క్యూసెక్కుల నీరు రాగా కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.954 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో ప్రతిసోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి సూచించారు ముడుచుకుపోయిన కాళ్లు, చేతులకు బాల్, ప్యాడ్స్‌పై వైద్యులు వ్యాయామం చేయిస్తారన్నారు. అలాగే ప్రత్యేక అవసరాలుగల చిన్నారులు, బధిరులకు ఐఈఆర్‌టీ పరికరాలతో విద్యనందిస్తారని తెలిపారు.

అన్నమయ్య సంకీర్తనలు అజరామరం

కర్నూలు కల్చరల్: పద కవితా పితామహుడు అన్నమయ్య సంకీర్తనలు అజరామరమని సాహితీ స్రవంతి కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అన్నారు. అన్నమయ్య జానపద కళాక్షేత్రం సొసైటీ ఆధ్వర్యంలో కృష్ణానగర్‌లోని శ్రీనటరాజ నాట్య సంగీత అకాడమీలో ఆదివారం అన్నమయ్య 520వ వర్ధంతిని నిర్వహించారు. అన్నమయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం ద్వారా భక్తిని, సామాజిక స్ఫూర్తిని తన కీర్తనల్లో అన్నమయ్య నిక్షిప్తం చేశారన్నారు. అన్నమయ్య జానపద కళాక్షేత్రం సొసైటీ బాధ్యులు జె.ఎస్.శేషయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంగీత అకాడమి ప్రిన్సిపాల్ జి.నారాయణ స్వామి, కళాకారులు వెంకటరమణ, అరుణ, అనురాధ, మనీష, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అన్నమయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు